మినీకథ

# వేస్ట్

– కొనకళ్ళ వెంకటరత్నం

**రామకృష్ణ జూట్ మిల్లు తెరిచే సందర్భంలో పెద్ద టీ పార్టీ ఇచ్చాడు.**

నగరంలో వున్న పెద్ద పెద్ద ఉద్యోగస్తులూ, ధనవంతులూ, బ్యాంకర్లు, మోతుబరులు అంతా ఆనందమహలులో కలుసుకోవడం అరుదయిన విషయమనే చెప్పాలి.

కలెక్టరుగారికీ, కమిషనర్‌గారికీ, కార్పొరేషన్ మేయరుగారికీ కావలసిందానికంటే కనీసం నాలుగైదు రెట్లయినా మర్యాద జరిగేటట్టు దివాన్జీ వొకడు కనిపెడుతూ అజమాయిషీ చేస్తున్నాడు.

అచ్చం పింగాణీవాటిలా కన్పిస్తున్న అన్‌బ్రేకబుల్ ప్లేట్లలో రంగురంగుల రసగుల్లాలూ, చంద్రకళలూ, అయిస్ క్రీమూ, బిస్కెట్లూ మిలమిలలాడుతూ కలకల నవ్వుతున్నాయి.

మహలుకి బయట కోలాహలంగా వుంది. లోపల టీ పార్టీ కావచ్చింది. గ్లాసుల్లో ఆరెంజీ క్రషులూ, బాదం పాలు, రకరకాల డ్రింకులూ ఎండ మావుల్లా మెరుస్తున్నాయి. గోల్డ్‌ఫ్లేక్ పొగల మెలికలలోనించీ, షాంపేను వాసన తెరలలో నించీ ఛలోక్తులెగిరి పడుతున్నాయి. నౌకర్లు మిగిలిన పదార్థమంతా వెదురుబుట్టలలోకి దిమ్మరించి, బాల్కనీ మీద నించే మైదానం మీదకి గిరాటు వేస్తున్నారు. ఆ పదార్థాలు కింద ఏదీ పడకముందే బైట మూగిన ముష్టివాళ్ళు, యానాదులూ, లంబాడీలూ కొట్లాటల్లో కనీసం యాభై మందయినా ఒకళ్ళనొకళ్ళు ఆవరించు కుంటున్నారు. పెనుగులాడుతున్నారు. మూటలు చుట్టుకుపోతున్నారు. తమ వంతు రావడానికి చాలా సమయం పడుతుందన్నట్టుగా కనుగుడ్లు కదపకుండా అదేపనిగా చూస్తూ వున్నాయి చుట్టూ వున్న కుక్కలు.

నా పక్కనించే రామకృష్ణ పురుముతున్నాడు. "వేస్ట్! వేస్ట్! చూశారా? ఎంత వేస్టోను?"

"నిజమే కాని"...

" 'కాని' అని మెల్లగా అంటున్నారా?"

తనతో ఏకాఏకీని ఏకీభవించనందుకు రామకృష్ణ చికాకుపడుతున్నాడు.

"లోపల మనం తిన్నదంతా వేస్టు కాలేదా అంటాను. ఈ టీ పార్టీకి వచ్చిన వాళ్ళల్లో ఫలహారం చెయ్యకుండా వచ్చిన పెద్ద మనుషులు గాని, సరాసరి ఇంటికి వెళ్ళగానే అజీర్తికి టానిక్కులో, టాబ్లెట్లో మ్రింగని వాళ్ళుగాని వుంటారనేనా మీ నమ్మకం?"

"అయితే మొత్తానికంతా వేస్టేనంటారు!"

వేదాంతం మాట్లాడుతున్నాననుకొంటున్నారు.

"అసలీ టీ పార్టీలో సద్వినియోగమయినదేమయినా వుంటే అది కాస్తా ఆ బైట పారేసిన పదార్థంలోనే వుందని నాకు గట్టి నమ్మకము"

"అదేమిటి?"

"అవును – అది ఆకలి. కడుపులలో పడుతుంది. అన్ని కండరాలలో హరించుకుపోతుంది."

"మీ పెడవాదన నా కర్థంకావడం లేదు. కొంత వేస్టయిన మాట నిజమేనని ఒప్పుకుంటారా లేదా చివరికి"

"బైట పారేసిన పదార్థం వేస్టయిందని మీరనుకుంటున్నారు. లోపల ఖర్చయిన పదార్థం వేస్టయిందని నేనూహిస్తున్నాను. అంతే తేడా" అన్నాను.

"అయితే ఫ్యాక్టరీ కూలీలకి పార్టీ ఇస్తే బావుండేదా?" వెటకారంగా చూశాడు రామకృష్ణ.

"తప్పకుండా – ఇప్పుడు మీరన్న వేస్టు లేకుండా వుండేది" చురుక్కున చూశాడు రామకృష్ణ. ■

## ◆ నగలు దాచేందుకు జాగ్రత్తలు ◆



వనితలకు చీరలతోపాటు ఎక్కువ విలువైనవీ ఇష్టమైనవీ నగలు. ఈ నగలను నిర్లక్ష్యం చేయకుండా వాటిని జాగ్రత్తగా దాచేందుకు కొన్ని మార్గాలున్నాయి.

1. రకరకాల నగలన్నీ ఒకే పెట్టెలో పెట్టేస్తే ఒకదానికి ఒకటి ఒరుసుకుపోయే ప్రమాదం వుంది. చిక్కుబడి సున్నితమైన నగలు వంగిపోయి విరిగిపోనూ వచ్చు.

2. బంగారు ఆభరణాలూ, వెండి ఆభరణాలూ ఒకే బాక్సులో దాచకూడదు.

3. బంగారు ఆభరణాలను దంతపు పెట్టెలో పెట్టవచ్చు. అయితే ఎర్రరంగు కాగితం చుట్టిన తర్వాత వాటికి మరింత రక్షణ ఏర్పరచినట్లే.

4. రాళ్ళనగలు నల్లబడకుండా వుండాలంటే ఒంటిమీద నుండి తీసేయగానే వాటిని కాస్త ఆరనిచ్చి ఆ తర్వాత భద్రపరచాలి.

5. వెల్‌వెట్ లైనింగ్ వున్న బాక్సుల్లోనే నగలు వుంచితే నాణ్యంగా వుంటాయి.

6. బ్యాంక్ లాకర్లో దాచే నగలను ఏడాదికి ఒకసారి మెత్తటి బట్టతో తుడవాలి. లేకుంటే వాటి మెరుపు తగ్గిపోయే అవకాశం వుంది.

7. అరుదైన శుభకార్యాలలో తప్ప, నిత్యం ఎక్కువ నగలు ధరించడం మంచిది కాదన్నది అతి ముఖ్యమైన జాగ్రత్త.

–హిమజ